వర్షం కురిస్తే.. ఇళ్లలోకి వరదనీరు

- ఇబ్బందులకు గురవుతున్న స్థానిక ప్రజలు
- 112 మీటర్ల పొడవున స్లాబ్ నాలా చేపట్టాలి
- నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ నేతల డిమాండ్



ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ నేతలు

నల్లకుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని పాత రామాలయం వీధిలో కురుస్తున్న భారీ వర్షానికి ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్(ఎన్‌సీఏ) నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎన్‌సీఏ ప్రతినిధి బృందం చీఫ్ ఇంజనీర్ రత్నకర్, ఎస్ఎన్‌డీపీ డీఎంసీ పి.వి.రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ సలహాదారులు డి.రామకృష్ణారావు, డాక్టర్ జయసూర్య, అధ్యక్ష, కార్యదర్శులు వి.మోహన్‌రావు, మోహన్‌నాయుడు, కార్యదర్శి కె.వీరయ్య, కోశాధికారి పి.శ్రీనివాస్‌రావు, సహాయ కార్యదర్శి వెంకటస్వామిగౌడ్, నాయకుడు సుకుమార్‌లు మాట్లాడారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నల్లకుంట పాతరామాలయం 14, 15, 16 వీధులలోకి వర్షం వరదనీరు ఇళ్లల్లోకి చేరుకుంటుందన్నారు. నల్లకుంట పాతరామాలయం చౌరస్తా నుంచి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు 112 మీటర్ల పొడవున స్లాబ్ నాలా నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు.

షరీఫుద్దీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ముషీరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బల్కంపేటలో ఈ నెల 17న వరద నీటి ఉధృతి వల్ల మృతిచెందిన రంగానగర్‌కు చెందిన షరీఫుద్దీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంఆర్‌పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జల రాజశేఖర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం భోలక్‌పూర్ రంగానగర్‌లోని షరీఫ్‌ఉద్దీన్ కుటుంబాన్ని కలిసి మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు దశరత్, స్థానిక నాయకుడు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం సమర్పిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నేతలు

రాంనగర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సోమవారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కల్లుగీత కార్మిక సంఘం నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చెరుపల్లి సీతారాములు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.వెంకట నరసయ్య, కార్యదర్శి ఎస్.రమేష్‌గౌడ్, నాయకులు ఎస్.ఆశన్నగౌడ్, గడ్డమీది జంగన్నగౌడ్ మాట్లాడారు. స్పందించిన మంత్రి.. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

● తులసీరామ్‌నగర్‌లో రక్తదాన శిబిరం



ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకున సేవాపక్షంలో భాగంగా బీజేవైఎం గోల్నాక డివిజన్ అధ్యక్షుడు టి.శ్రీరామ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని తులసీరామ్‌నగర్(లంక)లో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు హాజరై శిబిరాన్ని ప్రారంభించి, యువతను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు సూదగాని శ్రీధర్‌గౌడ్, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, పార్టీ సెంట్రల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్, కార్యాలయ కార్యదర్శి మూల రవీందర్‌గౌడ్, నేతలు తదితరులు పాల్గొన్నారు. - గోల్నాక

అశోక్ ఆమరణదీక్షపై సీఎం స్పందించాలి



మాట్లాడుతున్న నిరుద్యోగవిద్యార్థులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుమారి ఆంటీ విషయంలో తక్షణమే స్పందించిన సీఎం, ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు అశోక్ విషయంలో ఎందుకు స్పందించడం లేదని నిరుద్యోగులు ప్రశ్నించారు. అశోక్ 9వ రోజు దీక్ష సందర్భంగా చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో పోటీపరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు, నిరుద్యోగ విద్యార్థులు సోమవారం అశోక్ దీక్షకు వెళ్లి సంఘీభావం ప్రకటించారు. దీక్షపై ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని నిరుద్యోగ జేఏసీ నేతలు కయ్య వెంకటేష్, శంకర్‌నాయక్, సంపత్, సాయిమదు, ఇంద్ర, ఆస్మాలు హెచ్చరించారు.

ముషీరాబాద్‌లో భారీ వర్షం



రాంనగర్‌లో భారీ వర్షం

ముషీరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, భోలక్‌పూర్, రాంనగర్‌లో సోమవారం భారీ వర్షం కురిసింది. రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. వర్షం తాకిడి వల్ల రాజా డీలక్స్ చౌరస్తా నుంచి దాయారం మార్కెట్ వరకు నూతనంగా రోడ్డు వేస్తున్న చోట రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

రైలులో మంగళసూత్రం చోరీ

బర్కత్‌పుర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి మంగళసూత్రాన్ని దొంగ లాక్కునిపారిపోయాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బాచుపల్లికి చెందిన కల్పన(47) నాగోర్‌సోల్‌లో కాచిగూడకు రావడానికి అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. మహారాష్ట్ర ఊర్మిణి రైల్వే స్టేషన్ వద్ద ఆమె మెడలోని మూడు తులాల బంగారు మంగళసూత్రాన్ని దొంగ లాక్కుని పారిపోయాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.



ఆర్టీసీక్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేరళలోని శివం దేవాలయం నమూనాలో దుర్గామాత మండపం



జైస్వాల్‌గార్డెన్‌కాలనీలోని శ్రీమైసమ్మ దేవాలయంలో బాలత్రిపురసుందరిదేవి అలంకారంలో అమ్మవారు



బతుకమ్మకుంటలోని మైసమ్మ ఆలయంలో బాలత్రిపుర సుందరీ ఆలంకరణలో అమ్మవారు



జెమినీ కాలనీలోని శ్రీపోచమ్మ ఆలయంలో అమ్మవారి పూజలు చేస్తున్న ఆలయ పూజారి



అంబర్‌పేటలోని శ్రీమహాకాళి ఆలయంలో బాలత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు దర్శనం

వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో సోమవారం వైభవంగా దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. చిక్కడపల్లి, ముషీరాబాద్, గోల్నాక, రాంనగర్ ప్రాంతాల్లోని ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సందడి చేసింది. ప్రశాంత వాతావరణంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రజలకు పిలుపునిచ్చారు. - చిక్కడపల్లి, ముషీరాబాద్, గోల్నాక, రాంనగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి)



చిక్కడపల్లి ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో భవానీ మందిరంలో బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



జైస్వాల్‌గార్డెన్ కాలనీలోని శ్రీమైసమ్మ దేవాలయంలో హోమం, కుంకమార్చనలో పాల్గొన్న మహిళలు



చిక్కడపల్లిలోని నేతాజీ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న యోగా మాస్టర్ రమేష్, ముఠా నరేష్ తదితరులు



అంబర్‌పేట మహాకాళి అమ్మవారి ఆలయంలో దుర్గా హోమం



భోలక్‌పూర్‌లోని భవానీశంకర ఆలయంలో బాలత్రిపుర సుందరి అలంకరణలో ముస్తాబైన అమ్మవారికి పూజలు చేసిన ఆలయ కమిటీ చైర్మన్ మేడి సురేష్ కుమార్, ధర్మకర్తలు, ఈవో జ్యోతి

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ

- 26న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బతుకమ్మకుంట ప్రారంభం
- మహిళలు తరలివచ్చి విజయవంతం చేయాలి : మాజీ ఎంపీ వీహెచ్



చైతన్యనగర్‌లో మహిళలతో కలిసి బతుకమ్మలో పాల్గొని ఆడుతున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ కార్పొరేటర్ గరిగంటి శ్రీదేవీ రమేష్ తదితరులు

నల్లకుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అస్తిత్వానికి సాంస్కృతిక జీవనానికి ప్రతీక బతుకమ్మ పండగ అని మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్కొన్నారు. ప్రకృతి నుంచి వచ్చే పువ్వులను పూజించే విశిష్టమైన పండగ బతుకమ్మను మహిళలు భక్తితో జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు తీరొక్క పూలను సేకరించి ఆనందంగా వైభవంగా జరుపుకునే పండుగ బతుకమ్మ అని అన్నారు. నల్లకుంట డివిజన్ చైతన్యనగర్‌లోని శ్రీనల్లపోచమ్మ నాగదేవత ఆలయంలో మాజీ ఎంపీ వీహెచ్ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 26న బతుకమ్మకుంట చెరువులో అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ వేడుకలకు మహిళలు పెద్దఎత్తున తరలిరావాలని కోరుతూ డివిజన్‌లోని గోల్నాక కూరగాయల మార్కెట్, హనుమాన్‌నగర్, వెంకటేశ్వరనగర్, గోల్డెన్ ఆలయం వీధి, సంజయ్‌గాంధీనగర్ తదితర ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వీహెచ్ ఇంటింటికీ వెళ్లి స్థానిక మహిళలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గరిగంటి శ్రీదేవీ రమేష్, పులి జగన్, దిడ్డి రాంబాబు, పుల్లా నారాయణస్వామి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి.రమేష్, జీబీ.శ్యామ్‌రావు, సీహెచ్.భగవాన్, నాగరాజుగౌడ్, జి.లక్ష్మణ్, సీహెచ్.మురళీకృష్ణ, మోతె రోహిత్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్, టింగుల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యానగర్ ఓయూ క్యాంపస్‌లోని ద మదర్స్ ఇంటిగ్రల్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు - రాంనగర్, ఆంధ్రజ్యోతి

బతుకమ్మకుంట కల.. సీఎం సాకారం



దిడ్డి రాంబాబు

బర్కత్‌పుర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న బతుకమ్మ కుంటపై మాజీ ఎంపీ వి.హనుమంతరావు కలను సీఎం రేవంత్‌రెడ్డి సాకారం చేశారని జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్, సీనియర్ కాంగ్రెస్ నేత దిడ్డి రాంబాబు అన్నారు. వీహెచ్ 35 ఏళ్ల పోరాట ఫలితంగా బతుకమ్మకుంటకు కబ్జా నుంచి విముక్తి కలిగిందన్నారు. సోమవారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మకుంటను బతికించడానికి హైడ్రా కమిషనర్ రంగానాథ్ న్యాయపోరాటం చేశారని గుర్తుచేశారు. ఈ నెల 26న బతుకమ్మకుంటను సీఎం రేవంత్‌రెడ్డి జాతికి అంకితం చేస్తారని, ఈ సందర్భంగా బతుకమ్మ ఆటపాటలతో మహిళలు సందడి చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి కూడా పూర్తిసహకారం అందించారని తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటలకు బర్కత్‌పుర లింగంపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు బతుకమ్మలతో పెద్దఎత్తున తరలివస్తారని తెలిపారు. ఈ వేడుకల్లో మాజీ ఎంపీ వీహెచ్, డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

బండారు సుజాతశేఖర్‌కు అవార్డు ప్రదానం



బండారు సుజాతశేఖర్‌ను సన్మానిస్తున్న అతిథులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి, బతుకమ్మ తొలి పరిశోధకురాలు డా.బండారు సుజాతశేఖర్‌ను వారధి దుబాయ్ సంస్థవారు తెలుగు సాహిత్యరత్న అవార్డుతో సోమవారం సత్కరించారు. ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ వారు సుజాతశేఖర్‌ను దుబాయ్‌లో జరుగుతున్న బతుకమ్మఉత్సవాలకు ఆహ్వానించగా ఈ సత్కారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె రచించిన అమ్మఒడి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ప్రేమికులకు దళిత కల్యాణ వేదిక అండ

చిక్కడపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను ఎదిరించలేక ఎంతోమంది ప్రేమికులు మృత్యువాత పడుతున్న నేటి సమాజంలో అలాంటివారి కోసం మేమున్నామంటూ దళిత కల్యాణ వేదిక ధైర్యాన్ని నింపుతుంది. 1991లో స్థాపించబడిన దళిత కల్యాణ వేదిక నేటికీ ప్రేమికులకు 5,679 కులాంతర వివాహాలు చేయడమే కాకుండా రాష్ట్రప్రభుత్వం నుంచి అందే షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాన్ని కూడా దగ్గరుండి వారికి అందేలా కృషి చేస్తుంది. ఈ సందర్భంగా దళిత కల్యాణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రేణిగుంట్ల ఎల్లయ్య మాట్లాడుతూ దళిత కల్యాణ వేదిక ఆధ్వర్యంలో దేశాంతర, కులాంతర, మతాంతర, వర్ణాంతర, అన్ని కులాల వారికి వివాహాలు జరిపిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని కుల నిర్మూలన, అంటరానితనం, కులవివక్ష, వరకట్న నిషేధం రూపుమాపడానికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. వివరాలకు 9391139770, 9666987686, 9177687977 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కబడ్డీ విజేత రైల్వే కళాశాల



ట్రోఫీతో జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ చాంపియన్‌షిప్ టైటిల్‌ను రైల్వే డిగ్రీ కళాశాల కైవసం చేసుకుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలేజీలో జరిగిన ఫైనల్‌లో రైల్వే టీమ్ 21-10తో వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల (విద్యానగర్)పై నెగ్గింది. ఏవీ కళాశాల, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే, అంబేద్కర్ కళాశాల కార్యదర్శి జి.వినోద్ విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ముగింపు వేడుకలకు తెలంగాణ కబడ్డీ సంఘం కార్యదర్శి మహేందర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా క్రీడాధికారి ఎస్.సుధాకర్‌రావు, ఉస్మానియా వ్యాయామ విద్యా విభాగాధిపతి రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నళినికి బెనిఫిట్స్‌ను విడుదల చేయాలి



మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు వినతిపత్రం అందజేస్తున్న ఎం.భాగ్యలక్ష్మి

బర్కత్‌పుర, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారిణి, మలిదశ ఉద్యమంలో తన పదవికి రాజీనామా చేసి రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన మాజీ డీఎస్పీ నళినికి రావాల్సిన బెనిఫిట్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావుతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం నళిని మృత్యువుతో పోరాడుతుందని ఆమె చివరి ఆకాంక్షను తీర్చాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి నళినికి రావాల్సిన బెనిఫిట్స్‌ను విడుదల చేయాలని, భువనగిరిలోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించాలని కోరారు. అన్ని సంఘాలు నళినికి అండగా నిలవాలని కోరారు.

స్వదేశీ వస్తువులకు పూర్వవైభవం తీసుకురావాలి



మహిళలకు బహుమతులను అందజేసిన పద్మశాలి కాలనీ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు తదితరులు

ముషీరాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలపరిచేందుకు స్వదేశీ వస్తువులకు పూర్వవైభవం తీసుకురావల్సిన అవసరం ఉందని పద్మశాలి కాలనీ వేల్ఫేర్ సొసైటీ ప్రధానకార్యదర్శి, బీహెచ్ఈఎల్ సీనియర్ రిటైర్డ్ మేనేజర్ ఆర్.ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుమేరకు భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానికంగా నివసించే 2000 కుటుంబాలకు సోమవారం స్వదేశీ వస్తువుల వాడకంపై పోటీ నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కాలనీ వేల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుందర్‌పటాలే, గోవింద్‌రాజ్, చౌదరి, కమల్‌కుమర్ శర్మ, నాయకులు స్వప్న, ఉషారాణి శ్రీవాణి, లావణ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ జి.నాగేశ్వరరావు తెలిపారు. సాయిమధురానగర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, విఠల్‌వాడి పరిధిలో 11 నుంచి 11.30 వరకు, బతుకమ్మకుంట పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1 వరకు, జామైఉస్మానియా పరిధిలో 12.30 నుంచి 1 వరకు, సాయి బాబా టెంపుల్ పరిధిలో 2.30 నుంచి 3 గంటల వరకు, పార్శిగుట్ట పరిధిలో 2.30 నుంచి 3.30 గంటల వరకు, హర్రాజ్‌పెంట పరిధిలో 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

రాజ్యాధికారం కోసం పోరాడుదాం : ఆర్‌పీఐ

నల్లకుంట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల కోసం అడుక్కోవడం కాదు రాజ్యాధికారం కోసం పోరాడుదాం అని రిపబ్లికర్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు లేని రిజర్వేషన్స్ కోసం అగ్రకుల పార్టీల వద్ద అడుక్కోవడం మానేసి అందరం ఏకీకృతమై రాజ్యాధికారం కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఆధిపత్య వర్గాల పార్టీలకు గుణపాఠం చెప్పాలన్నారు.

ఆదివాసీలకు అన్ని పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలి

చిక్కడపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి ఎరుకల జాతివారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకినిరాజు డిమాండ్ చేశారు. సంఘం ముఖ్యనాయకుల సమావేశం చిక్కడపల్లిలో జరిగింది. ఈ సమావేశంలో లోకినిరాజు మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ఆదివాసి ఎరుకలకు విద్యా, ఉద్యోగ ఆర్థిక సామాజిక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవడంతో చాలా వెనుకబడి ఉన్నారన్నారు.